# మందార మకరందాలు

కాని అనురాధ మాత్రం అలా అనుకోలేదు.

★ ★ ★

బజారు నుంచి రావడంతోటే అడగాలనుకున్నాడు. కాని అంతలోనే మరేదో వ్యవహారం మనస్సును ఆకట్టుకుంది. తరువాత మరచిపోయాడు. గుర్తు రాకుండా మరుగున పడిపోయింది ఆ వ్యవహారం అంతా.

★ ★ ★

ఇంటి దగ్గరే విశ్రాంతిగా కూర్చున్నప్పుడు ఇలాంటి విషయాలు చప్పున మనసులోకి రావు. ఏదో కదలిక వుంటే తప్ప ఇలాంటి విషయాలు ఒకంతట బయటపడవు. 'నాకు సంగీతం నేర్చుకోవాలని వుంది. వకుళా భరణం గారి దగ్గర' అన్నాడు.

★ ★ ★

'రామారావు కనిపించాడు' అన్నాడు. ఆమె ముఖంలోకి చూచాడు. అతనికి కావలసిన మార్పు యేమీ దొరకలేదు.

ఒక నిమిషం ఆగి అతనే మళ్ళీ అన్నాడు. 'అతనికి సంగీతం నేర్చుకోవాలని వుంది. నీవేమో చెప్పనన్నావుట కదా!'

'మీరు ఫిర్యాదు చేశాడన్న మాట!'

'ఫిర్యాదు కాదు, చెప్పాడు అంతే.'

'అతనికి సంగీతం ఎందుకట?' వకుళాభరణం గొంతులో కాస్త వ్యంగ్యం వుంది.

'నేను అడగలేదు, నాకెందుకని.'

★ ★ ★

'ఈ మందారాలు యెక్కడివి?' అని అడిగాడు, యింటికి వస్తూనే. హాలులో యెదురుగుండా కనిపిస్తున్నాయి. ఎర్రటి మందారాలు మూడు గుత్తులుగా. కళ్ళు చెదిరిపోయేంత ఎర్రదనం! పూర్వం కమలా ఫలాలు ఆ ఎరుపులో వుండేవి. ఇప్పుడు ఇటువంటి ఎరుపు రంగు కూడా అసామాన్యం అయిపోయింది.

'మీ మిత్రుడు రామారావు పంపించాడు. మీరు ఎర్ర మందారాలు గురించి మొన్న ఉపన్యాసం యిచ్చారట గదా, అందుకు కృతజ్ఞతగా కావును!'

అతను ఆ మందారాలు చేతిలోనికి తీసుకున్నాడు. హాయి అనిపించింది మనసుకు చాలా సేపటిదాకా.

★ ★ ★

రామారావుకు ఉద్యోగం వుంది. ఆ ఉద్యోగం ఇన్‌కంటాక్స్ లెక్కలకు సంబంధించింది గాని సంగీతానికి సాహిత్యానికి సన్నిహితమయినదేమీకాదు. అనూరాధకు సంగీతం రాకపోవడం తన దురదృష్టంగా భావిస్తున్నాడు. ఆమె సంగీత కచేరీలకు కూడా రానంటుంది అదేం విడ్డూరమో గాని.

వకుళాభరణం మొదటిమారుగా యీ వూళ్ళో కచేరీ చేసినప్పుడు అతను దానికి హాజరయ్యాడు. కచేరీ అయిన తర్వాత ఆమె దగ్గరకు వచ్చి అభినందించాడు. మీలా సంగీతం పాడగలవాళ్ళు వుండడం ఈ ఊరికే గర్వకారణం-- అన్నాడు. ఆమె యేమీ బదులు చెప్ప లేదు. కృతజ్ఞతగా నవ్వి వూరుకుంది.

తరువాత అతను చాలా రోజులవరకూ కనపడలేదు. సెలవు మీద వెళ్ళాను - అన్నాడు తరవాత కలిసినప్పుడు. ఒకమారు మీ యింటికి వస్తాను, మీరు ఎప్పుడు తీరుబడిగా వుంటారు? అని అడిగాడు.

అదివారం నాడు రండి, వారు గూడా యింట్లో వుంటారు - అని బదులు చెప్పింది.

మళ్ళీ ఎన్ని గంటలకు - అని అడగలేదు, అతను.

సాయంత్రం నాలుగు గంటలకు వచ్చాడు.

వకుళాభరణం అతన్ని భర్తకు పరిచయం చేసింది. 'అప్పుడు కచేరిలో పలకరించారన్నానే, ఆ రామారావుగారు' అంది.

జనార్దనంతో చాలాసేపు మాట్లాడాడు, రామారావు. ఎక్కువగా ఉభయ కుశలోపరి, లోకాభిరామాయణంతో సరిపోయింది. వకుళాభరణం సంగీతం తనకు చాలా నచ్చిందన్నాడు. తాను సంగీతంలో ప్రవేశం లేని వాడే అయినా, ఎంతో అభిరుచి, అప్యాయత వున్న వాడినన్నాడు. అసలూ సంగీతం వల్లనే ప్రపంచం అంతా యింకా పూర్తిగా పాడు కాకుండా వుందన్నాడు.

★ ★ ★

జనార్దనం, రామారావు మంచి స్నేహితులు అయ్యారు. వాళ్ళిద్దరూ దాదాపు ప్రతిరోజూ సాయంకాలం క్లబ్బులో కలుసుకునేవాళ్ళు. తరువాత అతన్ని గురించి ఆమె యెన్నడూ వినలేదు, అతని దగ్గరనుంచి.

ఒక సంవత్సరం గడిచిపోయింది. వకుళాభరణం టౌన్ హాల్‌లో కచేరీ చేయడం తటస్థించింది. అప్పుడు రామారావు మళ్లీ ఆమెను కలుసుకుని మంచిగా మాట్లాడాడు. సంగీతం అంటే తనకు వున్న అభిమానాన్ని పునర్వ్యక్తీకరించాడు.

'నాకు సంగీతం నేర్చుకోవాలని వుంది, కాని సమయం తక్కువ. వారానికి ఒకరోజు మాత్రం రాగలుగుతాను, మీరు దయచేసి నేర్పుతారా?' అని అడిగాడు.

'నాకు సంగీతం నేర్పడం రాదు' అంది వకుళాభరణం.

రామారావు ఆశ్చర్యంగా ఆమె వంక చూచాడు. నమ్మలేను అన్నట్లుగా.

'నిజం, సార్. పాడేవాళ్ళందరికీ పాడడం నేర్పించడం రాదు. సంగీతం నేర్పించడం, పాడడం కంటే ఎక్కువ కష్టం' అంది ఆమె. ఇంకా నమ్మలేను – అన్నట్లుగానే చూచాడు రామారావు.

అక్కడితో ఆ ఘట్టం ముగిసింది.

★ ★ ★

జనార్దనానికి ఈ సంగతి చెప్పింది.

'పోనీ, నేర్పరాదూ – అతనంత ఉత్సాహంగా అడుగుతున్నాడు కదా!'

'నాకు నిజంగానే నేర్పడం రాదు. మీరు కూడా నమ్మలేకపోతున్నారా?'

'నాకూ ఈ విషయం కొత్తగానే అనిపిస్తోంది.'

'టీచర్స్ ట్రెయినింగ్ అయిన వాళ్ళు మాత్రమే చెప్పగలరు. బోధన అనగానే దానికి కొన్ని పద్ధతులూ వుంటాయి కదా? అవన్నీ తెలిసిన వాళ్ళు చెబితేనే అంతా పకడ్‌బందీగా వుంటుంది.'

రామారావుకు ఆమె మాటల్లో అపనమ్మకం లేకపోయినా, అది ఒకంతట మనసుకు పట్టలేదు. ఒక గురువు దగ్గర అయిదారు నెలలు నేర్చుకుని తరువాత సంగీత పాఠాలు చెప్పుకుంటూ బతుకుతున్నవాళ్ళను అతను అనేక మందిని ఎరుగును. అయినా అతను ఆమెతో వాదనకు దిగటానికి సిద్ధంగా లేడు.

★ ★ ★

మందారాల విషయంలో జనార్దనం దాదాపు స్పెషలిస్టు. వాటి పెంపకం, అభివృద్ధి ఎలా సాధ్యపడుతుందో అతనికి తెలిసినంత నేర్పుగా ఆ రాష్ట్రంలోనే మరెవరికీ తెలియదని పేరుంది.

అయితే వాటిలో మకరందం ఎలా చేరుతుందో అతనికి తెలియదు. అదంతా క్రిమి కీటకాలకు సంబంధించిన విషయం, నాకేమీ ప్రమేయం లేదు – అంటాడు. తేనెటీగల సమాచారం ప్రత్యేక పరిశోధనలు చేసిన వాళ్ళే చెబుతారు ఆ సంగతి.

★ ★ ★

'సంగీత మకరందం' అనే పుస్తకం నారద మహర్షి వ్రాశాడట. కాని అది ఎక్కడా లభ్యం కాదట! అన్నాడు ఒకరోజు రామారావు అతనితో.

'అవును, అనేక పాత పుస్తకాలు కాలగర్భంలో కలిసిపోయాయి.'

'నారదుడు గొప్ప విద్వాంసుడు. ఆయనే త్యాగరాజుగారిగి 'స్వరార్ణవం' అనే పుస్తకం యిచ్చాడట. ఆ తరువాతనే త్యాగరాజుగారు అంత గొప్ప విద్వాంసుడు కాగలిగాడు అని చరిత్రకారులు చెబుతారు.'

'అవును, నారదుడు గంధర్వుడు. సంగీతం గంధర్వ విద్య అని వాడుక' అన్నాడు జనార్దనం.

'సంగీతం నేర్చుకోలేని వాడి జన్మ వృథా!' అని నిట్టూర్చాడు రామారావు.

★ ★ ★

ఇంటికి వచ్చినప్పుడు జనార్దనం యీ ప్రస్తావన తీసుకువచ్చాడు.

'అతనికి నిజంగానే ఎంతో ఇంటరెస్టు – సంగీతం అంటే.'

'కావచ్చును. అయినా మరో మాట. 'స్వరార్ణవం' ఒక పుస్తకం కాదు. సంగీతానికి సంబంధించిన బీజాక్షరాలు నారదులవారు త్యాగరాజు నాలుక మీద రాసి వుంటారు. ఆయనను సంగీత సముద్రంలో ముంచి వుంటారు. ఆ సాగరంలో ఈత కొట్టటం ఎలాగో చెప్పి వుంటారు.'

'స్వరార్ణవం అంటే స్వరాల సముద్రం అనే గదా వాచ్యార్థం.'

'అవును. తరువాత రోజుల్లో దానిని గురించి చెప్పుకునేటప్పుడు, అదో పుస్తకంలాగా ప్రచారం అయింది, అంతే.'

ప్రతిదానికీ రూపం యిస్తే తప్ప మనం అర్థం చేసుకోలేం గదా! – అనుకున్నారు యిద్దరూ.

★ ★ ★

'ఇంతకూ నువ్వు మాత్రం రామారావుకు ససేమిరా సంగీతం నేర్పనంటావు' అన్నాడు ఒక తీరిక రోజు జనార్దనం.

'మళ్ళీ మొదటికి వస్తే నేనేం చెప్పను?'

జనార్దనం రెట్టించలేదు.

'నాకు సంగీతం నేర్పిన మేష్టరుగారు చాలా గొప్పవాడు. నా పాటకు అంతా ఆయనే కారణం. ఆయనను తలుచుకోకుండా నేను యేరోజూ గడపను. గురుభక్తి లేక యే విద్యా రాణించదని పూర్వులు చెబుతారు.'

'రామారావు భక్తిలో నాకేం లోపం కనిపించదు' అన్నాడు జనార్దనం.

'అతన్ని నేనేం అనడం లేదు. నాకు నేర్పడం రాదు అంటున్నాను, అంతే.'

★ ★ ★

వకుళాభరణానికి సంగీతం నేర్పిన మేష్టరుగారు గాత్ర సంగీతజ్ఞుడు కాదు. ఆయన వీణ మేష్టరు.

ఆ రోజుల్లో 'వకుళాభరణం-వీణ మేష్టారూ' అని అందరూ విడ్డూరంగా చెప్పుకునేవాళ్ళు. అయినా వకుళాభరణం అవేవీ లెక్కచేయకుండా తన సంగీత సాధనమీద మటుకే దృష్టి నిలిపి కాస్తో కూస్తో నేర్చుకుంది.

అవి పాత రోజులు. ఇప్పుడు మళ్ళీ నలుగురి నోళ్ళలో పడడం వకుళాభరణానికి ఇష్టం లేదు.

★ ★ ★

అనూరాధ 'సంగీతము చేత బేరసారములుడిగెన్' అన్న సూక్తి మీరు విన్నారా?' అని అడిగింది. రామారావు తల ఆడించాడు. తెలుసుననో, తెలియదనో ఆ జవాబు అర్థం చేసుకోవటానికి వీలుకాలేదు ఆమెకు. 'హాయిగా ఉద్యోగం పనులు చూచుకుంటూ కాలక్షేపం చేసుకోలేక ఇలాంటి వింత కోరికలు ఎందుకు?'

కొద్దిసేపు అయినాక ఆమె మళ్ళీ అడిగింది. 'ఆమెకు చెప్పడం రాదన్నదన్నారుగా. అయినా సంగీతం మీదేనా మీ యింటరెస్టు?'

'సంగీతం లేదు గనుక యింక, ఇంట-రెస్టే!' అన్నాడు అతను.

మకరందం లేని 'మకరం'గా మిగిలిపోవలసిందే నేను - అనుకున్నాడు, తన మనసులోనే. ❋

*(పత్రిక - 6, 2005)*